రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)	సెహరీ (శనివారం ఉదయం)
కడప	6.31	5.09
ప్రొద్దుటూరు	6.32	5.13

గొప్ప కవయిత్రి మొల్ల

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



కవయిత్రి మొల్ల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి


కడప, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సరళమైన తెలుగు భాషలో రామాయణం రచించిన గొప్ప కవయిత్రి మొల్ల అని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సభాభవన్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి సంస్కృతంలో రాసిన రామాయణాన్ని ఆధారం చేసుకుని పలువురు వివిధ భాషలలో రామాయణం రాశారన్నారు. అయితే మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యేరీతిలో తెలుగు భాషలో రామాయణాన్ని సరళంగా రాయడం గర్వించదగ్గ విషయమన్నారు. బద్వేలు వద్ద గల గోపవరం గ్రామానికి చెందిన మొల్ల అతితక్కువ పద్య, గద్యాలతో అత్యంత సులువైన శైలిలో రామాయణం రచించి నాటి పండిత పామరుల ప్రశంసలు పొందారన్నారు. తొలి తెలుగు కవయిత్రిగా చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పదిలపరచుకున్నారని అన్నారు. ముందుగా ముఖ్య అతిథులతో కలిసి కలెక్టర్ మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, సాహితీవేత్త నరాల రామారెడ్డి, మొల్లసాహితీ పీఠం అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, బీసీ వెల్ఫేర్ అధికారి భరత్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, సీపీవో హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో.. వైఛీపీలు

● భూకబ్జాలు, ల్యాండ్ మాఫియా

● జూదం ఆడిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు

● ఇలాంటి నేతలను ప్రోత్సహిస్తున్న అధికార పార్టీ నేతలు



(కడప-ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు, ఎన్నికల తరువాత వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన కొంతమంది చేసే అరాచకాలు ప్రభుత్వానికే మచ్చగా మారుతున్నాయి. జిల్లా ప్రజలు 2004 నుంచి వైఎస్ కుటుంబాన్ని మోస్తూ వచ్చారు. రెండుసార్లు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఒకసారి ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే జగన్ హయాంలోని 2019-2024లో జరిగిన భూదందాలు, సెటిల్‌మెంట్ల కారణంగా విసిగిపోయిన జనం గత ఏడాది జరిగిన ఎన్నికల్లో వైసీపీని గోతిలో పాతిపెట్టారు. దీంతో వైసీపీ నుంచి పలువురు టీడీపీలోకి వలస వచ్చారు. వీరిలో కొందరు మళ్లీ చెలరేగిపోతున్నారు.

కడప రాజారెడ్డివీధికి చెందిన ఎం.అశోక్‌రెడ్డిని జూదం వ్యవహారంలో మూడురోజులక్రితం రాయచోటి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇది కడప జిల్లా టీడీపీలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఎం.అశోక్‌రెడ్డి వైసీపీ హయాంలో కడప జిల్లాను శాసించిన ఓ సీఐకి బినామీ అని చెబుతారు. అప్పట్లో జిల్లాలో రోజూ జూదం నిర్వహించేవారని అంటారు. జూదం నిర్వహించే చోట లక్ష రూపాయలు ఇచ్చి రోజుకు రూ.5వేలు వడ్డీ తీసుకునే వారని అంటారు. ఇతను గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. 24వ వార్డు టీడీపీ ఇన్‌చార్జిగా అని చెబుతారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డికి ప్రధాన అనుచరుడినని ప్రచారం చేసుకునేవారు. ఎస్పీగా ఈజీ అశోక్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నాక జిల్లాలో జూదంపై ఉక్కుపాదం మోపారు. దీంతో జూదం బ్యాచ్ విలవిల్లాడారు. రాయచోటిని సేఫ్‌గా భావించి అక్కడ జూదం నిర్వహించడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం రాయచోటి పోలీసులు కడపకు వచ్చి ఎం.అశోక్‌రెడ్డిని తీసుకెళ్లి ఫార్టీ-1ఏ నోటీసులు ఇచ్చి పంపించారు. ఈ వ్యవహారం కడప టీడీపీలో దుమారం రేపింది.

వలస బ్యాచ్‌ల దందాలు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోస్తున్న కార్యకర్తలు ఎవరూ ఇలాంటి పనులు చేయలేదు. ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన వెఛీపీ బ్యాచ్‌తోనే టీడీపీకి చెడ్డపేరు వస్తోందని ఆ పార్టీ కార్యకర్తలు వాపోతున్నారు. 9 నెలల టీడీపీ పాలనలో కడపలో జరిగిన కబ్జాలు, సెటిల్‌మెంట్లు అన్నీ వైసీపీ నుంచి వలస వచ్చినవారే చేశారనే ఆరోపణలు ఉన్నాయి. పాత కడప నేత, చిన్నచౌకు బ్రదర్స్, రాజీవ్‌కట్ట బ్రదర్స్ మరికొందరు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చారు. వీరిలో కొందరు భూకబ్జాలు చేస్తే మరికొందరు ఇసుక దోపిడీ, పోలీస్‌స్టేషన్లలో సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. ఇంకొందరు వైఎస్సార్ లేఅవుట్‌లోని కొండ నుంచి గ్రావెల్, వాటర్ గండి నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీళ్ల సంపాదించుకోవడంతో పాటు వీళ్లను కాపాడే ముఖ్యనేతలకు, వీరిని నమ్ముకున్న వారికి భారీగా డబ్బులు ఇస్తారనే ప్రచారం ఉంది. ఇక ప్రొద్దుటూరులో కూడా ఇదే బ్యాచ్ ఎస్పీ అశోక్‌కుమార్ రాకముందు జూదం, బెట్టింగ్ నిర్వహించేవారు. ఇప్పుడు ఇసుక తవ్వుకుని అమ్ముకుంటున్నారు.

రోజువారి సెటిల్‌మెంట్ల కూలీలు

ఇక పోరుమామిళ్ల, బద్వేలులో ఈసారి సరికొత్త అధ్యాయానికి తెరలేపారు. బద్వేలు మండలం ఓబులవారిపల్లెకు చెందిన ఓ పార్టీ నేతలు బ్యాచ్‌గా ఏర్పడ్డారు. వీరంతా విలువైన స్థలాలపై కన్నేయడం, వాటిపై తప్పుడు పేపర్లు సృష్టించడం, ఇది మాదంటూ గోడ కట్టడం చేస్తున్నారు. ఇక పోరుమామిళ్లలో కోటి రూపాయల స్థలం కొట్టేయాలంటే ఓబ్యాచ్‌ను కలిస్తే చాలు. వారితో సెటిల్‌మెంట్ చేసుకుంటే ఏ స్థలాన్నైనా సెటిల్ చేసేస్తారు. ఇప్పటి దాకా రోజువారి కూలి ఇస్తే పొలాల్లో పనులు చేసేందుకు కూలీలు రావడం చూశాం. ఇప్పుడు పోరుమామిళ్లలో తొలిసారిగా దౌర్జన్యాలు, సెటిల్‌మెంట్లకు రోజువారీ కూలీలు వస్తున్నారు. వారిని అడ్డుపెట్టుకుని దందా కొందరు నేతలు దందా సాగిస్తున్నారు. చంద్రబాబు చెప్పినట్లు కూటమి ప్రభుత్వం కంటిన్యూగా ఉండాలన్నా.. పవన్ ఆశించినట్లు 15 ఏళ్లు అధికారంలో ఉండాలన్నా.. ఇక కార్యకర్తలే నా ప్రాణం అంటున్న నారా లోకేశ్ పార్టీని కాపాడుకోవాలన్నా.. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఇలాంటి చెదలును ఆదిలోనే అణచకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే అని పలువురు పార్టీ అభిమానులు పేర్కొంటున్నారు.

> కూటమి ప్రభుత్వం మరో 15 ఏళ్లు అధికారంలో ఉంటే రాష్ట్రం బాగుపడుతుందంటూ చంద్రబాబునాయుడు, పపవన్‌కళ్యాణ్ అంటున్నారు. ఈ మేరకు రాష్ట్రాభివృద్ధికోసం వారు పరితపిస్తున్నారు. అయితే జిల్లాలో జరుగుతున్నది వేరు. జగన్ అధికారంలో ఉన్నన్నాళ్లూ అక్రమాలకు పాల్పడి జనంతో ఛీకొట్టించుకున్న వైసీపీ నేతలు అనంతరం టీడీపీలో చేరారు. ఇక్కడా వీరు భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, జూదం నిర్వహణతో చెలరేగిపోతున్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్న వీరికి టీడీపీలో ముఖ్యనేతల అండ ఉందనే ప్రచారం సాగుతోంది.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

కడప కలెక్టరేట్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరుగుతాయన్నారు. రోజూ ఉదయం 9-30 గంటల నుంచి 12-45 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో 161 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని 14,330 మంది బాలురు, 13,470 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు భద్రత కల్పించాలని 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లడం నిషేధించామన్నారు. విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు జాన్ ఇర్విన్, చిన్నయ్య, చంద్రమోహన్, తహశీల్దార్లు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేలకోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి అనుమతులను జాప్యం చేయరాదని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. గురువారం కలక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రెవెన్యూ సదస్సులు, గ్రామ సభలు, పౌర సరఫరాల పంపిణీ తదితరాలపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తహశీల్దార్ల వద్దకు వచ్చిన దరఖాస్తులను రెండు రోజుల్లో క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పంపాలన్నారు. వారు 24 గంటల్లో పరిష్కరించాలన్నారు. లేదంటే పరిశీలించి నివేదిక తయారు చేసి ప్రతిపాదనలు పంపాలన్నారు. సకాలంలో అనుమతులు ఇవ్వక జాప్యం చేసి అక్రమ మైనింగ్‌కు ఆస్కారం ఇవ్వద్దన్నారు. గ్రామస్థులు, ప్రజలు ఎవరైనా అభ్యంతరం తెలిపితే వారితో మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై అర్జీలు వస్తే క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేయాలన్నారు. జిల్లాలో పౌరసరఫరాల అంశంలో వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల పంపిణీ, తూకాల వ్యత్యాసం, వస్తువుల లోడింగ్, అన్లోడింగ్, స్టాక్ వెరిఫికేషన్ తనిఖీలు తదితరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, మైన్స్‌శాఖ డీడీ సూర్యచంద్రరావు, ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకట్రామయ్య పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఔదార్యం
● క్యాన్సర్ బాధిత విద్యార్థికి రూ.6లక్షల సాయం 7

ఖాజీపేటలో పేలనున్న మరో ఐపీ బాంబ్?
● దాదాపు రూ.7 కోట్లతో వ్యాపారి పరార్ 7

క్రికెట్ బెట్టింగ్ కేసులో..

పోలీసుల అదుపులో వైసీపీ నేత

● పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న వైసీపీ నేతలు



ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్లో ఉన్న వైసీపీ నేతలు



వైసీపీ నేత నాగేంద్ర (ఫైల్‌ఫొటో)

ప్రొద్దుటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీ 40 వవార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ రావులకొల్లు అరుణ భర్త నాగేంద్రను గురువారం ఒన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మార్చి 1వ తేదీన నాగేంద్రను జమ్మలమడుగు పోలీసులు క్రికెట్ బెట్టింగ్ కేసులో అరెస్టు చేశారు. మళ్లీ క్రికెట్ బెట్టింగ్ సాగిస్తున్నాడని వచ్చిన సమాచారంతో అతనితో పాటు మరో ముగ్గురిని గురువారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నాగేంద్ర మొబైల్ ఫోన్‌లో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారాలకు సంబంధించి కీలక సమాచారం లభ్యమైనట్లు చెబుతున్నారు. నాగేంద్రతో పాటు మరో ముగ్గురు వ్యక్తుల సెల్ ఫోన్‌లలో ఫోన్‌పే లావాదేవీలను తనిఖీ చేస్తున్నారు. ఎవరెవరికి ఎంత మొత్తంలో ఫోన్‌పే ద్వారా లావాదేవీలు సాగించింది పరిశీలిస్తున్నారు. ఈ లింకుద్వారా క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలు సాగించిన మరికొందరిని గుర్తించనున్నారు. వారిని కూడా రేపో మాపో అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది. కాగా నాగేంద్రను ఒన్‌టౌన్ పోలీసులు స్టేషనుకు తీసుకొచ్చి విచారిస్తున్న క్రమంలో వైసీపీ ఎంపీపీ శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారుమునిరెడ్డి, ఆయిల్ మిల్లు ఖాజా, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, పాతకోట వంశీధర్‌రెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐ రామకృష్ణారెడ్డితో మాట్లాడారు.

రాయచోటి అల్లర్ల కారకులను వదిలిపెట్టం

● కొంతమంది అల్లరి మూకల వల్లే గొడవలు

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ, జేసీ

రాయచోటి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వీరభద్రస్వామి పార్వేట ఉత్సవం సందర్భంగా కొందరు అల్లరి మూకల వల్ల అవాంఛనీయ సంఘటనలు జరిగాయని, వాటికి కారకులను వదిలిపెట్టమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో హిందూ, ముస్లింలతో గురువారం శాంతి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించారు. రంజాన్ పండుగ తర్వాత శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్తులో ఇటువంటి ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఈనెల 4న గాంధీబజార్, ఠాణాసర్కిల్‌లో జరిగిన సంఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా కొన్ని అపోహలు తలెత్తాయన్నారు. అన్నదమ్ముల్లా కలిసి జీవించే ప్రజల మధ్య కొన్ని వర్గాల వల్ల చిన్నపాటి గొడవ జరిగిందన్నారు. 40 సంవత్సరాలుగా రాజకీయంగా ఉన్న తమ కుటుంబం రాయచోటి ప్రాంత ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తోందన్నారు. గొడవల సంఘటనలో కారకుల మీద మాత్రమే చర్యలు తీసుకోవాలని, దీనికి సంబంధం లేని అమాయకులపై ఎటువంటి కేసులు పెట్టకూడదని పోలీసులకు చెప్పానన్నారు. కొంతమంది కావాలని సోషల్ మీడియాలో చేసిన దుష్ప్రచారాల వల్ల చిన్న సంఘటన రాష్ట్రవ్యాప్తంగా పాకిపోయిందని అన్నారు. రంజాన్ తర్వాత మరోమారు శాంతికమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి హిందూ, ముస్లింలు ఎప్పటికీ కలిసి మెలిసి ఉండేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



ఆగిన కాలేటివాగు గేట్ల పనులు



పాపాఘ్నిలోకి నీరు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన కాలువ

కాలేటివాగు పూర్తయ్యేనా..?

● ఆగిన ఆధునికీకరణ పనులు



నిలిచిపోయిన సంపు పనులు



కాలేటివాగు రాతికట్టడం

చక్రాయపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి నిల్వ లక్ష్యంతో ప్రారంభించిన కాలేటివాగు డ్యాం పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో వేలాది ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం అటకెక్కింది. చక్రాయపేట మండలం ఎర్రబొమ్మనపల్లె సమీపంలో ఉన్న కాలేటివాగు డ్యాంను ఆధునికీకరించి 1.50 టీఎంసీల నీరు నిల్వ ఉంచాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం దాదాపు రూ.5వేల కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు పూర్తయితే చక్రాయపేట మండలంతో పాటు అన్నమయ్య జిల్లాలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, తంబళ్లపల్లె, కలికిరి, పీలేరు వరకు వేలాది ఎకరాలకు సాగునీరు అందించవచ్చని అంచనా. అప్పట్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన సంస్థ పనులు దక్కించుకుంది. కాలేటి వాగు డ్యాం కట్ట పనులు పూర్తి చేశారు. చక్రాయపేట మండలంలోని దాదాపు 16 చెరువులకు నీరు అందించేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఇంకా గేట్లు అమర్చాల్సి ఉంది. కాలేటివాగు నుంచి వెలిగల్లు డ్యాం వరకు పనులు చేయాల్సి ఉంది. హంద్రీనీవా నుంచి కాలేటివాగు వరకు నీరు తెచ్చి పంపింగ్ చేసేందుకు డ్యాం సమీపంలో సంపును కూడా ఏర్పాటుచేశారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. ఆ సంపు నుంచే చక్రాయ పేట మండలంలోని అన్ని చెరువులకు నీరు అందించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే కడప జిల్లాలోని కొన్ని, అన్నమయ్య జిల్లాలోని కొన్ని మండలాలు సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉంది.

జరగాల్సిన పనులు

ప్రధానంగా గేట్ల పను లతో పాటు, పాత తూముల ద్వారా అవుతున్న నీటి వృధాను అరికట్టాలి. సంపు, కుడి, ఎడమ కాలు వలు, ఆనకట్టకు రాతిపరుపు పనులు చేయా ల్సి ఉంది. దాదాపు 30 శాతం పనులు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. అధికారులు స్పందించి పనులు ప్రా రంభించి ఆయకట్టుకు నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటికోసం బిందెలతో కొట్టుకున్నారు



బీఎన్‌తాండాలో తాగునీటికోసం కొట్టుకుంటున్న మహిళలు

చక్రాయపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట మండలంలో నీటి ఎద్దడి తీవ్రం అవుతోంది. ముఖ్యంగా కె.ఎర్రగుడి గ్రామం బీఎన్‌తాండాలో నీటి ఎద్దడి చాలా తీవ్రంగా ఉంది. దాదాపు 200 కుటుంబాలు ఉన్న బీఎన్ తాండాలో ఎలాంటి బోర్లు, స్కీములు లేకపోవడంతో నీటి కోసం తిప్పలు తప్పడం లేదు. గురువారం ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా క్యూలో ఉన్న మహిళల మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై ఒకరు బిందెలతో దాడి చేసుకున్నారు. కాగా.. ఇటీవల పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో తాండాలో బోరు వేశారు. అందులో నీరు పడినా కరెంటు కనెక్షన్ లేదు. దీంతో బోరు ఉన్నా నిరుపయోగంగా ఉంది. ఇక్కడ ఓవర్‌హెడ్ ట్యాంకు ఉన్నప్పటికి మోటర్ కాలిపోవడం, భూగర్భజలాలు అడుగంటడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బీఎన్‌తాండాలో పశువులు ఎక్కువగా ఉన్నాయి. దీనితో మరింత ఇబ్బంది తలెత్తుతోంది. ఇప్పటికైనా తమకు తాగునీటి సమస్య తీర్చాలని బీఎన్‌తాండా వాసులు కోరుతున్నారు.



బీఎన్‌తాండాలో నిరుపయోగంగా ఉన్న బోరు

పీ-4 సర్వేతో ప్రతి ఇంటికి అభివృద్ధి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్.. చిత్రంలో ఎస్పీ అశోక్‌కుమార్ తదితరులు

కడప కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పీ-4 సర్వేతో ప్రతి ఇంటికి అభివృద్ధి ఫలాలు అందుతాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో స్వర్ణాంధ్ర-2047లో భాగంగా పీ-4 సర్వే, ప్రజాభిప్రాయాలపై ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047లో భాగంగా అట్టడుగున ఉన్న 20 శాతం పేదలను అత్యున్నత స్థానంలో ఉన్న 10శాతం సంపన్నుల భాగస్వామ్యం ద్వారా అభివృద్ధి చేయడమే పీ-4సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. వెనుకబడిన కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు ఈ పాలసీ దోహద పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలని, పేదలను అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు. విద్య, వైద్య, ఆర్థిక రంగాల్లో వృద్ధి సాధించి పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా స్మార్ట్ మొబైల్‌లో ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి సలహాలు, సూచనలు, ఆలోచనలు తెలపాలన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలోని వివిధ వర్గాలు, మేధావులు, నిపుణులు, ప్రజలు తమ సహకారాలు అందించి పీ-4 మోడల్ ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశం అనంతరం పారిశ్రామికవేత్తలు, బ్యాంకు అధికారులు, ఇతరులు పీ-4 విధానంపై సూచనలు, సలహాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవోలు జాన్‌ఇర్విన్, సాయిశ్రీ, సీపీవో హజరతయ్య, జడ్పీ సీఈవో ఓబులమ్మ, ఆనంద్‌నాయక్, రాజ్యలక్ష్మి, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం (1.0) కింద అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయం అందిస్తుందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున అందించనుందన్నారు. దాదాపు 25 వేలమంది లబ్ధిదారులకు ఈ ఆర్థికసాయం అందనుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయం సిబ్బంది, గృహ నిర్మాణ ఇంజనీర్లు ఈనెల 15 నుండి 23వ తేదీ వరకు ఇళ్ల నిర్మాణాల వద్దకు వెళ్లి యాప్ ద్వారా ఫొటోలు తీసి హౌసింగ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షణ చేయాలన్నారు.

దాతలు భాగస్వామ్యం కావాలి

చెన్నూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనలో దాతలు భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు తెలిపారు. గురువారం చెన్నూరులో ఆయన మాట్లాడుతూ ఈనెల 8 నుండి 26వతేదీలోపు దాతలు భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. అలాగే సూచనలు, సలహాలు ఇచ్చినవారు మండల పరిధిలో జరిగే సమావేశంలో పాల్గొనాలని సూచించారు.

కూల్చివేయడం దారుణం

కడప నాగరాజుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాశినాయన క్షేత్రంలోని అన్నదాన సత్రం, గోశాల గెస్ట్‌హౌస్‌లను అటవీశాఖ అధికారులు కూల్చివేయడం దారుణమని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. గురువారం ఆయన కాశినాయన ఆశ్రమంలోని కూల్చివేతలను పరిశీలించారు. పేదలు, యాత్రికుల ఆకలి తీరుస్తున్న అన్నదాన సత్రం, ఇతర వసతులపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించడం గర్హనీయమన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ

చెన్నూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ, ఈబీసీ మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి అనంతరం కుట్టుమిషన్లు ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు తెలిపారు. ఈనెల 22వ తేదీలోగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 నుండి 50సంవత్సరాలల్లోపు వయసు ఉన్న మహిళలు అర్హులని, ఆధార్, రేషన్‌కార్డు, కుల ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బాలికల హైస్కూల్ హెచ్‌ఎంగా శ్రీనివాసులు

వేంపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా తెలుగు ఉపాధ్యాయుడు చెరుకూరి శ్రీనివాసులును నియమిస్తూ ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ పనిచేస్తున్న హెచ్‌ఎం నారాయణమ్మ ఈనెల 7వ తేదీన సస్పెండ్‌కు గురయ్యారు.

ప్లాస్టిక్‌తో జీవజాతికి ముప్పు

కడప(వినాయకనగర్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకంతో జీవజాతికి తీరని ముప్పు వాటిల్లనుందని ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ బృందం పేర్కొన్నారు. గురువారం స్థానిక కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, జంతుశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వలన కలిగే దుష్పలితాలు, పర్యావరణ కాలుష్యం, మానవులు, ఇతర జీవజాతికి వ్యాధులు, ప్లాస్టిక్ నివారణ మార్గాలు వంటి అంశాలపై చర్చించారు. అనంతరం పేపర్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు డాక్టర్ శశిదేవి, విజయలక్ష్మిదేవి, స్వరూప, వహిదా, రిజ్వానా, మీనాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలపై వైసీపీ మాట్లాడడం సిగ్గుచేటు

● ఉనికి కోసమే వైసీపీ ఆరాటం ● గోవర్ధన్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వైసీపీ నాయకులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం కడప నగరంలోని లా కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో నోరుమెదవని వైసీపీ ఎమ్మెల్యేలు రోడ్లపైకి రావడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ దశలవారీగా బకాయిలు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. వైసీపీ ఉనికి కోసం ఆరాటపడుతోందన్నారు. వైఎస్ జగన్ దగ్గర మార్కుల కోసం వైసీపీ శ్రేణులు రోడ్లపైకి వస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు వైసీపీని ఛీకొట్టారన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు విడతల వారీగా విడుదల చేస్తామని శాసన మండలిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైసీపీ కుంభకోణాలను విజయసాయిరెడ్డి బయటపెడుతున్నారన్నారు. సమావేశంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాగుణం కలిగి ఉండాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు సేవాగుణం కలిగి ఉండాలని హైదరాబాద్‌కు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ పరిశీలకుడు సైదానాయక్ అన్నారు. గురువారం యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు 200 మంది బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేశారు. 150కిలోల ప్లాస్టిక్ పేపర్లు, చెత్తను సేకరించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు విజయ్‌కుమార్, అనంతలక్ష్మి, కళాశాల ఏవో శ్రీనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌దే

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న రవీంద్రనాథరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తొమ్మిది సంవత్సరాలు అధికారం లేకపోయినా పార్టీని నిలబెట్టడమే చాలా గొప్ప విషయమన్నారు. చిరంజీవి రెండేళ్లకే ప్రజారాజ్యం పార్టీని అమ్ముకున్నాడని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలకు ఇంటి వద్దకు సంక్షేమ పథకాలను అందంచిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని అభివర్ణించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

కడప క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ ఈదురుబాషా సూచించారు. విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగేలా పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కడప నగరం అక్కాయపల్లెలోని సాయికృప నర్సింగ్ స్కూలు విద్యార్థినులకు ఫోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, డయల్ 100, రహదారి భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల తీసుకోవాలసిన జాగ్రత్తలపై వివరించారు.

'ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించండి'

పులివెందుల రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ రాముడు కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్లాస్టిక్ నిర్మూలనపై దుకాణదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వలన మనుషులు క్యాన్సర్ వంటి రోగాల బారిన పడుతున్నారని, కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని తెలిపారు. దాదాపు 600కు పైగా దుకాణాలు ఉన్నాయని, వాటి నుంచి ప్రతి రోజు 10మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వస్తోందన్నారు. నిషేధిత ప్లాస్టిక్ కనిపిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. బయోడీగ్రేడబుల్ కవర్లను వినియోగించాలని సూచించారు.

నేడు కాశినాయన ఆలయంలో పౌర్ణమి పూజలు

వీరపునాయునిపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.పాలగిరి క్రాస్ వద్ద ఉన్న కాశిరెడ్డినాయన ఆలయంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లక్ష్మిరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజలు, భక్తిగీతాలాపన, భజన, అన్నదానంతో పాటు రాత్రి సానవుల చిన్నమ్మ కథ కార్యక్రమాలు ఉన్నట్లు తెలిపారు.

సుదర్శన హోమంలో పాల్గొన్న పుత్తా కుటుంబీకులు



వైభవంగా సామూహిక లక్ష్మీకుంకుమార్చన

వల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మాచిరెడ్డిపల్లెలో జరుగుతున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు గురువారం సామూహిక లక్ష్మీకుంకుమార్చనను వైభవంగా నిర్వహించారు. మహిళలు తరలి వచ్చి ఈ కుంకుమార్చనలో పాల్గొని స్వామివారిని పూజించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ముందుగా లక్ష్మీనరసిం హస్వామికి ఉదయం ప్రభాతపూజ, గణపతి, సుదర్శన హోమాలు నిర్వహించారు. సాయంత్రం చతుష్ఠాన పారాయణం, నరసింహ సహస్ర నామ హోమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం, వృషభరాజముల బండలాగుడు పోటీలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపకుడు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఆయన సతీమణి సరళమ్మ, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, ఆయన సతీమణి చైతన్యరెడ్డి, పుత్తా రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి వెంకటసుబ్బమ్మతో పాటు సాయినరసింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

'యువత పోరు' అని రోడ్డు ఎక్కడం సిగ్గుచేటు

● తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి

కమలాపురం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు యువత పోరు అంటూ రోడ్డు ఎక్కడం సిగ్గుచేటని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పుత్తా ఎల్లారెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జాబ్ క్యాలెండరు పేరుతో యువతకు ఉద్యోగాలు ఇస్తామని ఆశ చూపి మోసగించింది మీరు కాదా అని ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, ఇప్పుడు ఎనిమిది నెలల్లో ఏదో మునిగిపోయిందని రోడ్డు ఎక్కడం ఏమిటని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చుతారని, అందుకు కొంత సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు బాబా సుబ్బారెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల పలు రచనలు చేసి ఉండవచ్చు

● శతావధాని నరాల రామారెడ్డి

కడప కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కవయిత్రి మొల్లమాంబ 90సంవత్సరాలకు పైగా జీవించి, మొల్ల రామాయణం ఒక్కటి మాత్రమే రాసిందంటే నమ్మశక్యంగా లేదని, ఇతరత్రా పలు రచనలు కూడా రచించి ఉండవచ్చని, అవన్నీ కాలగర్భంలో కలిసిపోయాయని ప్రముఖ కవి, శతావధాని నరాల రామారెడ్డి సందేహం వ్యక్తం చేశారు. మొల్ల జయంతి సందర్భంగా గురువారం స్థానిక విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో 'మహిళా స్ఫూర్తి మొల్ల' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. అనంతరం గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ కాలగర్భంలో కలిసిపోయిన మొల్ల జీవన, చారిత్రక విశేషాలను సాహితీలోకానికి, భావితరాలకు అందించడమే తన జీవిత లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రాయుడు, వెంకటసుబ్బారెడ్డి, వర్మ, సుబ్బరాయుడు, సుధాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక నాటక పితామహుడు కోలాచలం

● జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూల

కడప కల్చరల్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): కోలాచలం శ్రీనివాసరావు చారిత్రక నాటక రచనలతో ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడిగా ప్రసిద్ధుడని, తెలుగు నాటకానికొక నవ్య దశను నిర్దేశించిన మహోన్నత నాటకకర్త అని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కొనియాడారు. కోలాచలం జయంతి సందర్భంగా గురువారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మూల మాట్లాడుతూ కోలాచలం దాదాపుగా 30 నాటకాలు రచించారని, ఆంగ్లంలో ప్రపంచ నాటకరంగ చరిత్ర రచించి విశ్వవిజ్ఞాన వేదిక ముందు తెలుగు వారి ఘనచరిత్రను చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో మధురకవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు సత్యనారాయణ, రంగస్థల కళాకారులు గంగయ్య, చిన్న చెన్నయ్య, మురళి, బాల ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నీటి శుద్ధి మిషన్ల ఏర్పాటు

వేంపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శుద్ధినీరు అందుబాటులోకి వచ్చింది. మూలనపడి పనిచేయకుండా వదిలేసిన నీటిశుద్ధి మిషన్లను సంబంధిత కంపెనీ సిబ్బంది వచ్చి మరమ్మతులు చేశారు. ఈనెల 2వ తేదీన ఆంధ్రజ్యోతిలో విద్యార్థులకు శుద్ధినీరు కలేనా అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన విద్యాశాఖ అధికారి స్టాలిన్ సంబంధిత కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. ఇడుపులపాయ మారుతినగర్, కుమ్మరాంపల్లె ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న నీటిశుద్ధి మిషన్లకు మరమ్మతులు చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అన్నదానానికి వేంపల్లె నుంచి సరుకులు

వేంపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో అన్నదానం చేసేందుకు వేంపల్లె నుంచి భక్తులు సరుకులను లారీలో తీసుకెళ్లారు. ప్రతి ఏడాది గరుడసేవ రోజున వేంపల్లె వాసులు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

'వీఆర్వోపై చర్యలు తీసుకోవాలి'

కడప సెవెన్ రోడ్స్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మండలం రంగసముద్రం నర్సింగ్‌పల్లె ఎస్సీ కాలనీ శ్మశాన వాటికను ఆక్రమించిన వీఆర్వో గురయ్య అలియాస్ బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, పోరుమామిళ్ల మండల కార్యదర్శి రవికుమార్ నేతృత్వంలో గ్రామస్థులు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. సర్వే నెంబర్‌లో 443లో 1.80ఎకరాల భూమిలో దళితులకు కేటాయించిన శ్మశానాన్ని అదే గ్రామానికి చెందిన వీఆర్వో జక్కుల గురయ్య అలియాస్ బాలకృష్ణ, చిరంజీవి ఆక్రమించి చేసి ఆన్‌లైన్ చేసుకున్నారని, ఎవరైనా చనిపోతే అక్కడ భూస్థాపితం చేయనీయకుండా గురయ్య కుటుంబసభ్యులు మారణాయుధాలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. వీఆర్వో గురయ్యను తక్షణం ఉద్యోగం నుంచి తొలగించి శ్మశానాన్ని పరిరక్షించాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి'

కడప నాగరాజుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ జిల్లా నాయకుడు మద్దిలేటిపై దాడి చేసిన గంజాయి బ్యాచ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మద్దిలేటిని గురువారం నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సిద్దిక్, ఆర్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు నవీన్‌తో కలిసి ఆయన పరామర్శించారు. దాడి జరిగి ఐదు రోజులైనా నిందితులను అరెస్టు చేయలేదని, ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

కంట్లో కారంచల్లి కత్తితో దాడి

- మహిళకు తీవ్ర గాయాలు
- మెడలోని బంగారు గొలుసు అపహరణ


గాయపడిన లక్ష్మీదేవి

కమలాపురం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కంట్లో కారం చల్లి.. కత్తితో దాడి చేసి మహిళ మెడలోని బంగారు గొలుసు దోచుకెళ్లిన సంఘటన గురువారం కమలాపురం పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. కమలాపురంలోని గిడ్డంగి వీధిలో లక్ష్మి దేవి అనే మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండగా.. అదే వీధికి చెందిన నవీన్ అనే యువకుడు ఆమె కంట్లోకారం పొడి చల్లి కత్తితో దాడి చేశాడు. దాడిలో మహిళ ముక్కు, మెడతో పాటు పలుచోట్ల గాయాలై తీవ్ర రక్తస్రావంతో పడిపోయింది. దీంతో ఆమె మెడలో ఉన్న పది తులాల బంగారుసరుడు దోచుకెళ్లాడు. గాయపడిన మహిళను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అం దించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. నిందితుని కోసం గాలింపు చర్యలు చేప ట్టినట్లు సీఐ రోషన్ తెలిపారు.

స్కూటర్లు ఢీ.. వ్యక్తి మృతి

రాజుపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో రెండు స్కూటర్లు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ కత్తి వెంకటరమణ వివరాల మేరకు.. గురువారం గాదెగూడూరు గ్రామానికి చెందిన సుంకు ప్రసాద్ (56) తమ గ్రామం నుంచి మోటారు సైకిల్‌లో ప్రొద్దుటూరుకు వెళుతున్నాడు. అదే సమయంలో టంగుటూరు గ్రామానికి చెందిన కాసా వెంకటసుబ్బారెడ్డి తన మోటరు సైకిలులో ప్రొద్దుటూరు వైపు నుంచి వెంగలాయపల్లెకు వస్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సుంకు ప్రసాద్ కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో రెండు కృష్ణ జింకలు మృతి


మృతి చెందిన కృష్ణ జింక

ములకలచెరువు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో రెండు కృష్ణజింకలు మృతి చెందాయి. స్థానిక పీటీఎం రోడ్డులోని టీటీడీ కల్యాణమండపం సమీపంలో రోడ్డు దాటుతున్న కృష్ణ జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణ జింక అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే కదిరినాథునికోట పంచాయతీ కాసుపల్లె వద్ద కుక్కల గుంపు దాడి చేయడంతో మరో కృష్ణ జింక మృతి చెందింది. రెండు వేర్వేరు ఘటనల్లో మృతిచెందిన జింకలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం జింకల కళేబరాలను ఖననం చేశారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

చాపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యపాడు గ్రామంలో హోసయ్య (45) అనే వ్యక్తి గురువారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాజమండ్రికి చెందిన హోసయ్య పశువుల షెడ్డులో పనిచేస్తుండేవాడు. గురువారం హోసయ్య కరెంటు తీగెలు లాగుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన కుటుంబ సభ్యులు ఇంకా ఫిర్యాదు చేయనందున కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి


దగ్గటూరు రాజా మృతదేహం

సికెదిన్నె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బైకు అదుపు తప్పి దగ్గటూరు రాజా (58) అనే వ్యక్తి మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన రాజా, మహేశ్వర్‌రెడ్డిలు పని నిమిత్తం కడపకు వెళ్లి తిరిగి వస్తుండగా మూలవంక, కొత్తపేట మధ్యలో బైకుకు అడ్డంగా కుక్కరావడంతో తప్పించబోయి కల్వర్టును ఢీకొన్నారు. ప్రమాదంలో దగ్గటూరు రాజా మరణించగా... గాయపడిన మహేశ్వర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

వివాహిత అదృశ్యం



కడప క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బాలాజీనగర్‌కు చెందిన పెద్దపల్లి మాధవీ అదృశ్యమైనట్లు తాలుకా పోలీసులు తెలిపారు. బాలాజీనగర్‌కు చెందిన మాధవీ 2023 మార్చి 23న ఇంటి వద్ద నుంచి వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. ఆమె ఆచూకీ కోసం బంధువులను విచారించగా సరైన సమా చారం లేకపోవడంతో ఆమె భర్త నాగరాజు ఇచ్చిన ఫిర్యా దు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన బాలిక



కడప క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజారెడ్డివీధికి చెందిన కొమ్మనూరు స్వీటీ (16) అనే బాలిక అదృశ్యమైనట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్ నాథరెడ్డి తెలిపారు. గత నెల 25న ఇంటి వద్ద నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆ బాలిక ఆచూకీ తెలియకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రాజంపేటలో పౌల్ట్రీస్థలం పరిశీలన

- ఇతర స్థలాలపై కూడా దృష్టి
- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి


రాజంపేటలో ఎస్సీ కార్పొరేషన్ స్థలాలను పరిశీలిస్తున్న ఈడీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ స్థలాలు పరిశీలించేందుకు అధికార యంత్రాంగం కదిలింది. ఎస్సీ కార్పొరేషన్ భూములు పరాధీనం అనే శీర్షిక ఈనెల 8న ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై ఎస్సీ కార్పొరేషన్ అధికార యంత్రాంగం స్థలాల పశీలనకు సిద్ధమైంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇందులో భాగంగా రాజంపేట మండలంలోని తాళ్లపాక వద్దనున్న పౌల్ట్రీ కాంప్లెక్స్ స్థలాలను గురువారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి, డైరెక్టర్ అనిత దీప్తి, దళిత సంఘాల ప్రతినిధులు పరిశీలించారు. ఈ విషయంపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మిని ఆంధ్రజ్యోతి సంప్రదించగా రాజంపేట వద్దనున్న పౌల్ట్రీలో చాలా మంది ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. గతంలో జీవనాధారం కోసం పౌల్ట్రీలు ఇచ్చిన వారిలో కొంత మంది అందుబాటులో లేకపోవడంతో మరో దఫా పరిశీలించాల్సి ఉందన్నారు. తహసీల్దార్ కూడా అందుబాటులో లేరన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కి సంబంధించిన మొత్తం పది ఎకరాలు స్థలం ఉండగా పౌల్ట్రీ షెడ్ల కోసం కొంత స్థలాన్ని నిర్మించి మిగిలిన జాగాను ఖాళీగా ఉంచడం జరిగిందన్నారు. ఆ ఖాళీస్థలం కూడా ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. కొంత స్థలాన్ని కొంతమంది విక్రయించినట్లు కూడా తమ విచారణలో ఆరోపణలు వచ్చాయన్నారు. ఏదిఏమైన ఎస్సీ కార్పొరేషన్ సంబంధించిన భూములు ఎంత వరకు ఉన్నాయనే విషయంపై తహసీల్దార్‌కు లేఖ రాసి హద్దులు చూపమని అడగనున్నట్లు తెలిపారు. పౌల్ట్రీ స్థలాల ఆక్రమణ అంశంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆమె వివరించారు.

హోలీ పండుగను సురక్షితంగా జరుపుకోండి

రాయచోటిటౌన్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): హోలి పండుగను సురక్షితంగా, బాధ్యతతో జరుపుకోవాలని... పండుగ పేరుతో సంబంధం లేని వ్యక్తులపై రంగులు చల్లినా, ఆడవారితో అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. ఎవరి స్వేచ్ఛకు భంగం కలిగించకుండా హోలీ పండుగను జరుపుకోవాలని, ప్రజలంతా పోలీసులకు సహకరించాలని తెలిపారు. హోలీ పేరుతో ఎవరైనా ఎవరైనా బలవంతంగా చందాలు వసూలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో వీధుల్లో ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా తిరగడం, భారీ శబ్దాలు చేయడం లాంటివి అనుమతి లేదన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో 100, 112 నెంబర్లకు డయల్ చేయడమే కాకుండా సమీప పోలీస్‌స్టేషన్లను సంప్రదించాలని ఎస్పీ పేర్కొన్నారు.

మత సామరస్యం పాటించాలి : కడప ఎస్పీ

కడప క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోళీ పండుగను సురక్షితంగా .. బాధ్యతతో మత సామరస్యం పాటిస్తూ.. ఎటువంటి గొడవలకు తావు లేకుండా సంతోషకర వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. ఎవరైనా హద్దులు దాటితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఇతరులపై బలవంతంగా రంగులు వేయడం లాంటివి చేయకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

రోడ్డుప్రమాదంపై రవాణాశాఖ అధికారి విచారణ


విచారణ చేస్తున్న రవాణాశాఖ అధికారి శ్వేత

కడప క్రైం, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): కడప నగరంలో ఈ నెల 7న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం ఘటనపై రవాణా శాఖ అధికారి శ్వేత గురువా రం విచారణ చేపట్టారు. ఏడు రోడ్ల వద్ద రోడ్డుదాటుతున్న వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొన డంతో సంఘట నాస్థలంలో మృతి చెందాడు. ఈ ఘట నపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేయగా బస్సు కండీ షన్‌పై గురువారం ఉదయం రవాణాశాఖ అధికారి శ్వేత దర్యాప్తు చేపట్టారు. ఏడు రోడ్ల వద్ద ప్రతిరోజూ రాత్రి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు పదుల సంఖ్యలో నిలబెడుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువ అవుతోందని పోలీసులు చెబుతున్నారు. ఎన్నిసార్లు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యజమానులకు చెప్పినా అక్కడే గంటల కొద్దీ బస్సులు నిలుపుతుండడంతో రోడ్డు ప్రమాదాలకు జరుగుతున్నాయని చెబుతున్నారు. దీంతో బస్సుల యజమానులకు త్వరలో నోటీ సులు జారీ చేస్తామని ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు.

ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, గోడౌన్‌లలో పోలీసుల తనిఖీలు



కడప క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, గోడౌన్లలో గురువారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయి, ఇతర నిషే ధిత మత్తు పదార్థాలను పూర్తిగా కట్టడి చేసే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా జరగకుండా జిల్లా ఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నగరంలోని ఆర్టీసీ బస్టాండు, మేకలదొడ్డి తదితర ప్రాంతాల్లోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, గోడౌన్‌లు, ప్రముఖ ఆన్‌లైన్ మార్కెటింగ్ కంపెనీల గోడౌన్‌లలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణాకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్శిళ్లలో ఎక్కడైనా గంజాయి ఆనవాళ్లను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీల్లో ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

15 లోగా వెబ్ ఆప్షన్‌లు ఎంచుకోవాలి

కడప (వినాయకనగర్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డీఎస్సీకి ఉచిత కోచింగ్ తీసుకునే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఎండీఎఫ్‌సీ.ఏపీఈఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌పోర్టల్‌లో ఈ నెల 15 లోగా వెబ్ ఆప్షన్‌లు ఎంచుకోవాలని సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్ ఆప్షన్ ప్రారంభించామని.. ఇప్పటికి వెయ్యి మంది అభ్యర్థులు తమ వెబ్ ఆప్షన్‌లు పూర్తి చేశారన్నారు. షార్టులిస్టు చేసిన అభ్యర్థుందరూ సకాలంలో వారి వెబ్ ఆప్షన్‌లు పూర్తి చేయాలన్నారు. అభ్యర్థుల జాబితా వెబ్ పోర్టల్‌లో ప్రదర్శిస్తామని తెలిపారు. వెబ్ ఆప్షన్ సర్వీసు ద్వారా కోచింగ్ సంస్థలకు తమ ప్రాధాన్యతను తెలియజేయాలన్నారు.

ఖాజీపేటలో పేలనున్న మరో ఐపీ బాంబ్?

- రూ. 5 నుంచి 7 కోట్లతో వ్యాపారి పరార్


నూనె అంగడి వద్ద గుమికూడిన రుణదాతలు

ఖాజీపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం రూ.2 కోట్లతో ఐపీ పెట్టిన వ్యక్తి గురించి చర్చించుకుంటుండగానే గురువారం మరో వ్యక్తి భారీ ఎత్తున ఐపీ పెట్టి ఉడాయించినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్లితే... ఖాజీపేట మండలం బోయపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గత కొంత కాలంగా ఖాజీపేట వాసులకు పరిచయస్తుడే. ఇతను రియల్ ఎస్టేట్ వ్యాపారం, నూనె వ్యాపారం చేస్తూ ప్రజలను బాగా ఆకర్షించాడు. మూడు నెలల క్రితం ఖాజీపేట మైదుకూరు రహదారిలో సూపర్‌మార్కెట్ భారీ ఎత్తున ప్రారంభించాడు. దీంతో అడిగిన ప్రతి ఒక్కరు అతనికి రుణం ఇచ్చేందుకు ఇష్టపడ్డారు. ఇదే అదునుగా ఆ వ్యక్తి రూ. 5 కోట్ల నుంచి రూ.7 కోట్ల దాకా రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈనెల 10వ తేదీ 'ఆంధ్రజ్యోతి'లో ఖాజీపేటలో పేలనున్న ఐపీ బాంబ్ కథనంతో కలకలం రేగింది. ఈ నేపథ్యంలో సూపర్‌మార్కెట్ నడుపుతున్న వ్యక్తి పరిస్థితి గురించి తెలుసుకునేందుకు అక్కడకు వెళ్లగా.. ఆ వ్యక్తి అప్పటికే పరారీ అయి సెల్ కూడా స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. దీంతో కోపోద్రిక్తులైన జనం సూపర్‌మార్కెట్‌తోపాటు ఆయిల్ అంగడి వద్ద గొడవచేయడంతో ఆ వ్యక్తి బావమరిది తాళాలు వేసి పోలీసుస్టేషన్‌లో అప్పగించడానికి వెళ్లినట్లు సమాచారం. దీంతో ఖాజీపేట బస్టాండులోని కిరాణాషాపులో జరిగినట్లు ఇక్కడ కూడా సరుకు మాయం అవుతుందేమోనని రుణ దాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యూత్ పార్లమెంట్ ఉపన్యాసాల రిజిస్ట్రేషన్ గడువు పెంపు

కడప కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ యుజన, క్రీడా వ్యవహారాల శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆదేశాల మేరకు యూత్ పార్లమెంట్ ఉపన్యాసాల పోటీలలో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 16వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ తెలిపారు. పోటీలలో పాల్గొనే యువత ఒన్ నేషన్.. ఒన్ ఎలక్షన్ అనే అంశంపై ఉపన్యాసాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చాటిన వారు దేశస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తారన్నారు. ప్రధానంగా అన్నమయ్య, కడప జిల్లా పరిధిలోని 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల యువత రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈనెల 15న కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించాల్సిన ఉపన్యాస పోటీలు రిజిస్ట్రేషన్ గడువు పెంపు కారణంగా వాయిదా వేసినట్లు వెల్లడించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న యువత ఈ మార్పును గమనించాలని కోరారు. ఉపన్యాస పోటీలు తదుపరి నిర్వహించే తేదీని త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాలకు అదనపు ఆర్థిక సహాయం : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం సాయంత్రం ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు సంబంధించి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఎస్టీ వర్గానికి చెందిన వారికి రూ.75 వేలు, ఎస్సీ, బీసీ వర్గాల వారికి రూ.50 వేలు అందిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సాయం మొత్తాన్ని వివిధ దశల్లో అందజేస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ ఆర్థిక సహాయం గతంలో ప్రభుత్వం వారు అందిస్తున్న 1.8 లక్షల రూపాయలకు అదనంగా ఇస్తున్నట్లుగా పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 19,672 మందికి 100 కోట్ల రూపాయల అదనపు ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం గురించి చెప్పి దశల వారీగా నిర్మాణంలో ఉన్న ఇళ్లకు ఆర్థిక సహాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ శాఖ పీడీ సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఔదార్యం

- క్యాన్సర్ బాధిత విద్యార్థికి రూ.6లక్షల సాయం


బాధిత విద్యార్థి తండ్రికి రూ.6లక్షలను అందిస్తున్న ట్రిపుల్‌ఐటీ హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థులు, ఏఓ రవికుమార్

వేంపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తోటి విద్యార్థి జబ్బుతో బాధపడుతుంటే సహచర విద్యార్థులు తమ ఔదార్యం చాటుకున్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో విద్యార్థులు నడుపుతున్న సేవాసంస్థ ద్వారా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల నుంచి రూ.5.02 లక్షలు, మిగిలిన ట్రిపుల్‌ఐటీల ద్వారా మరో లక్ష రూపాయలు సేకరించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సురేంద్ర అనే విద్యార్థి బ్లడ్ మరియు బోన్ క్యాన్సర్‌తో వేలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సుమారు రూ.40లక్షలు చికిత్సకు అవసరం కాగా విద్యార్థులు సేకరించిన రూ.6లక్షలను బుధవారం ట్రిపుల్‌ఐటీ ఏఓ రవికుమార్ చేతులమీదుగా బాధిత విద్యార్థి తండ్రి పౌలురాజుకు అందజేశారు. విద్యార్థుల సహాయాన్ని ఎన్నటికీ మరువలేనని విద్యార్థి తండ్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఎవరైనా దాతలు ముందు కొచ్చి సహాయం చేస్తే విద్యార్థి ప్రాణాలు కాపాడడంలో భాగస్వాములవుతారని... సహాయం చేయదలచిన వారు 8688283876 నెంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కాశినాయన క్షేత్ర అభివృద్ధికోసం కేంద్ర మంత్రిని కలిసిన రితేష్‌రెడ్డి


కేంద్ర మంత్రి భూపేంద్రయాదవ్‌ను కలసిన రితేష్‌రెడ్డి

బద్వేలుటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :కాశినాయన క్షేత్ర అభివృద్ధి కోసం కేంద్ర అటవీశాఖా మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఢిల్లీలో గురువారం రితేష్ కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల కాశినాయన క్షేత్రంలో జరిగిన కూల్చివేత ఘటనను కేంద్ర మంత్రికి వివరించి.. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు స్పందించిన మంత్రి భూపేంద్రయాదవ్ ఆలయ సమస్య తీవ్ర తను అర్థం చేసుకొని.. త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామన్నారని రితేష్ తెలిపారు.

కడప మెడికల్ కాలేజీ డీడీగా హేమలత

కలికిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ వైద్య కళాశాల డిప్యూటీ డైరెక్టర్‌గా ఐ. హేమలతను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలులో మెడికల్ సర్వీసెస్ ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్‌గా డెప్యూటేషన్‌పై పని చేస్తున్న హేమలతను మాతృ సంస్థలోకి తిప్పి పంపుతూ ప్రస్తుతం ఖాళీగా వున్న వైద్య కళాశాల డీడీగా నియమించారు. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు గురువారం ఆదేశాలు జారీ చేశారు.

లాభదాయకంగా నిమ్మ సాగు

● పర్యాటకమే కాదు.. పంటల్లోనూ మేటిగా నిలిచిన గండికోట ● ఇక్కడ పండిన నిమ్మకాయలు పొరుగు రాష్ట్రాలకు భారీగా ఎగుమతి

జమ్మలమడుగు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోట నిమ్మపంటకు ప్రసిద్ధి చెందింది. , ఉద్యానవన పంటల్లో మంచి లాభదాయకంగా ఇక్కడ నిమ్మ పంటను రైతులు విస్తారంగా సాగుచేస్తారు. గండికోట పర్యాటక ప్రాంతమే అయినా నిమ్మసాగులోనూ పేరుగాంచింది. గ్రామంలో చుట్టుపక్కల అలాగే గండికోట కొట్టాలపల్లి గ్రామంలో నిమ్మతోటలు దర్శనమిస్తాయి. కొండ ప్రాంతమైనప్పటికి నిమ్మసాగును ఒక్కో రైతు వేలల్లో సాగు చేస్తారు. ప్రస్తుతం జమ్మలమడుగు మండలంలోని గండికోటలో సుమారు 500 ఎకరాల్లో నిమ్మసాగు చేసినట్లు రైతుల ద్వారా తెలుస్తోంది. గండికోట పరిధిలోని కొట్టాలపల్లెకు ప్రధాన జీవనాధారం నిమ్మసాగు. అక్కడున్న రైతులు అనేక మంది నిమ్మ పంట సాగు చేసి జమ్మలమడుగు పట్టణంలో 12 కి.మీ. దూరంలో నివాసం ఉంటూ ప్రతిరోజు తోటలో వెళ్లి కూలీలను పిలుచుకుని నిమ్మకాయలను వేరుచేసి బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు.

గండికోట నిమ్మ ముంబై, బెంగళూరుకు ఎగుమతి

మండలంలోని గండికోట ప్రాంతం నుంచి ప్రతిరోజు సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు బస్తాలలో నిమ్మకాలు తెచ్చి ముద్దనూరు రోడ్డులో నుంచి లారీలు, ట్రాక్టర్లలో ముంబై, బెంగళూరుకు భారీగా ఎగుమతి చేస్తుంటారు. సాగు చేసిన నిమ్మతోటలలో భారీగా ఖర్చు చేసినా వలం వేసవి కాలంలోనే రెట్టింపు ఆదాయం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రతిరోజు జమ్మలమడుగు పట్టణంలోని గండికోటకు వెళ్లే దారి నుంచి లారీలు, ముంబై, బెంగుళూరు, బళ్లారి, కడప, ప్రకాశం జిల్లా తదితర ప్రాంతాలకు తరలిస్తారు. అలాగే సమీప గ్రామాల్లో కొన్ని నిమ్మకాయల బస్తాలను రైతులు వ్యాపారస్థులకు విక్రయించడంతో రాత్రి సమయాల్లో ట్రాక్టర్లలో తీసుకొస్తారు. ప్రస్తుతం ధరలు అంతంత మాత్రంగా ఉన్నాయని, 40 కేజీల నిమ్మకాయల బస్తా గత నెలలో 1200 నుంచి రూ.1600 వరకు ఉండేదని, మార్చి నెలలో రూ.2,200లకు వచ్చిందని, ఏప్రిల్ నెలలో అమాంతం భారీగా ధరలు పెరుగుతాయని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జమ్మలమడుగులో ప్రతిరోజు గండికోట, గండికోటకొట్టాలపల్లి గ్రామాల్లో నిమ్మకాయలు బయటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.



తోటలో నిమ్మకాయలను వేరు చేస్తున్న కూలీలు

ఇక నుంచి తోపుడు బండ్ల గేటు రుసుము లేదు

● మాట నిలుపుకొన్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్ ,మార్చి13(ఆంధ్రజ్యోతి) : తోపుడు బండ్లకు మార్చి 1 నుంచి మార్కెట్ రుసుం చెల్లించనవసరం లేదని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ గురువారం తెలిపారు. ఆ మేరకు ఆయన తమను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో తోపుడు బండ్లు మున్సిపల్ గేటు రుసుం చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తాను ఎమ్మెల్యే అయిన వెంటనే తోపుడు బండ్లకు రుసుం తీసి వేస్తామని మాటా ఇచ్చారు. ఆ మాటకు కట్టుబడి మున్సిపాలిటీ గేటు వేలం పాటలో తోపుడుబండ్లకు రుసుం మినహాయింపు తోనే వేలం పాట నిర్వహించారు. దినసరి కురగాయల మార్కెట్ రూ.14 లక్షల 64 వేలకు బీఎన్ బ్రహ్మయ్య, బస్టాండ్ గేటు వేలం పాటలో పర్వతగారి రమణయ్య రూ.17 లక్షల 86 వేలకు వేలంపాట పాడి దక్కించుకొన్నారు. తోపుడు బండ్లు వ్యాపారం చేసుకొనే వ్యాపారస్తులు మాట నిలుపుకొన్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

వేలం ద్వారా బద్వేలు మున్సిపాలిటీకి భారీ ఆదాయం

బద్వేలు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్‌కు, పొట్టేళ్లు, మేకల సంతతోపాటు, మాంసం, చేపల మార్కెట్‌కు సంబంధించి బహిరంగంగా గురువారం బద్వేలు మున్సిపాలిటీకి భారీ ఆదాయం వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాటను నిర్వహించారు. కూరగాయల మార్కెట్‌కు రూ.19.3లక్షలు అశోక్‌రాయల్ వేలంపాటలో దక్కించుకోగా, పొట్టేళ్లు, మేకల సంతకుగాను రూ. 1.62లక్షలు ఓబుళరెడ్డి దక్కించుకున్నారు. మాంసం, చేపల మార్కెట్‌కు ఎవరూ పాల్గొనక పోవడంతో వాయిదా వేసినట్లు కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎర్రగుంట్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నగరపంచాయతి పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి తెలిపారు. ముద్దనూరు రోడ్డు, వేంపల్లిరోడ్డు, కడప రోడ్డు, రాణీవనం, వినాయకనగర్, సందరయ్యనగర్, ప్రొద్దుటూరు రోడ్డు, ఎస్టేట్‌ఏరియాల్లో ఉదయం 8.30గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ లైన్లలో మరమ్మతు పనులు చేస్తున్నందున అంతరాయం ఉంటుందన్నారు.

ఆధ్యాత్మికతతోనే శాంతి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ముద్దనూరు మార్చి13(ఆంధ్రజ్యోతి):ఆధ్యాత్మికతతోనే శాంతి కలుగుతుందని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత డాక్టర్ ఎన్. తులసిరెడ్డి అన్నారు. మండల పరిధి మంగపట్నంలోని రామాలయంలో గురువారం భగవద్గీత ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో భాగవత సప్తాహం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తులసిరెడ్డి హాజరై మాట్లాడారు. భాగవతులు కళాకారులని వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జానకిరామశర్మ,బాలకృష్ణారెడ్డి,పురుషోత్తంరెడ్డి,ఉపేంద్రనాయుడు,గంగిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి,బ్రహ్మానందరెడ్డి బషీర్, పీరా పాల్గొన్నారు.

ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయించవద్దు



మెడికల్ షాపుల వారికి సూచనలు ఇస్తున్న సీఐ రాజగోపాల్

బద్వేలుటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మందుల షాపులలో వైద్యుల ప్రిస్కిప్షన్ లేనిదే మందులను అమ్మరాదని బద్వేలు అర్బన్ సీఐ రాజగోపాల్, ఎస్ఐ రవికుమార్‌లు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్నతాదికారుల సూచనల మేరకు మెడికల్ షాపువారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్‌సీఐ రాజగోపాల్ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు బానిసై పెడదారిన పడుతున్నారని, అలాంటి వారు కొందరు మెడికల్ షాపుకు వచ్చి మత్తును ఇచ్చే కొన్ని మందులను అడిగితే డాక్టర్ల ప్రిస్కిప్షన్ లేనిదే ఎలాంటి మందులు అమ్మరా దన్నారు. ఈ సమావేశంలో మెడికల్‌షాపు అధ్యక్షుడు సముద్రాల రాధాక్రిష్ణ, ఉపాధ్యక్షుడు చలమల వెంకటసుబ్బారెడ్డి, సెక్రటరి దర్శి సుబ్బరాజ, ట్రజరర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు హోలీ వేడుకలు

కొండాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తాపురం గ్రామంలోని మెయిన్, బీసీ కాలనీ ఎలిమెంటరీ పాఠశాలల్లో గురువారం ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు రంగులు చల్లుకున్నారు. మన పండుగల సంస్కృతి సంప్రదాయాలు పిల్లలకు తెలియజెప్పేందుకే హోళి వేడుకలు పాఠశాలలో నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

మహిళా సాధికారితకు టీడీపీ ప్రాధాన్యం

బద్వేలుటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశంపార్టీ మహిళా సాదికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మాజీ ఎమెల్యే విజయమ్మ అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మహిళా ఆర్థిక స్వాలంబనకు డ్వాక్రా పథకాలకు శ్రీకారం చుట్టి వారి జీవనస్థితిగతులను మార్చి అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే డ్వాక్రాలోని ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఒక్కొక్కరికి రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొండా సింగరాయస్వామి ఆరాధనోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం నుంచి మిట్టమానుపల్లె మార్గమధ్యంలో శ్రీదేవి, భూదేవి సమేత కొండాసింగరాయ స్వామి ఆరాధనోత్సవాలు పౌర్ణమి పురష్కరించుకుని శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బీవీ నరసయ్య తెలిపారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

పోరుమామిళ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని వెంకటాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 253 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఆ సంస్థ ప్రతినిధులు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈ కర్యాక్రమం నిర్వహిస్తున్నామ్నారు.

మాదిగ ఉపకులాలకు అన్యాయం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్ నివేదికలో మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని దండు వీరయ్య మాదిగ పేర్కొన్నారు. గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ కోసం నియమించిన రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్ వర్గీకరణను మూడు కేటగిరిలుగా విభజించి మాలలకు 7.5 శాతం, మాదిగలకు 6.5 శాతం, ఇతర ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందన్నారు. డప్పు, చర్మకారుల రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాదిగ, రాష్ట్ర కార్యదర్శి కరుణ మాదిగ, జిల్లా కార్యదర్శి పుల్లయ్య, గణిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు యల్లయ్య పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఖాజీపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక లారెన్స్ వృద్ధాశ్రమంలో గురువారం రావులపల్లె పంచాయతీ ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి జన్మదినాన్ని పురష్కరించుకుని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు సహాయం చేస్తే ఎంతో తృప్తిగా ఉంటుందన్నారు.

మంత్రి నారాలోకేశ్ నిర్ణయం హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పోరుమామిళ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ కాశినాయన క్షేత్రం పునర్నిర్మాణంపై తీసుకున్న నిర్ణయం గొప్ప విషయమని టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కాశినాయన క్షేత్రంలో జరిగిన సంఘటనపై స్పందించిన మంత్రి నారాలోకేశ్ తన సొంత నిధులతో పునర్నిర్మిస్తామని చెప్పడం హర్షణీయమని పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల టీడీపీ నేతలు మురుకూటి రాజారెడ్డి, మురుకూటి గుర్విరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, కొండా రామక్రిష్ణారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, కొండా దుగ్గిరెడ్డి, శెట్టిం ప్రతాప్ తదితరులు పేర్కొన్నారు. గురువారం పోరుమామిళ్లలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాశినాయన క్షేత్రంలో 2014లోనే నిర్మాణాలు నిలిపివేశారని, కానీ ఇటీవల జరిగిన పరిణామాలపై స్పందించిన బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి ఇక్కడి విషయాలను సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే నిర్ణయం తీసుకోవడానికి ఎంతో కృషి చేశారన్నారు .అలాగే రాత్రికి రాత్రే జ్యోతి క్షేత్రానికి బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులతో అన్నదాన సత్రాలు పునర్నిర్మించాలి

ప్రభుత్వ నిధులతో అన్నదాన సత్రాలను ఇతర వసతులు పునర్నిర్మించాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు .బద్వేలు నియోజకవర్గంలోని కాశినాయన క్షేత్రానికి చెందిన స్నానపు గదులు, అన్నదాన సత్రాలు, గోశాల గెస్ట్‌హౌస్‌లను అటవీశాఖాధికారులు కూల్చివేయడం సమంజసం కాదన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బి.కోడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం 98 శాతం ఉత్తీర్ణత సాధించామని ఈ సంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులను సమాయత్తం చేశామన్నారు. మండలంలో 159 మంది రెగ్యులర్ విద్యార్థులు సప్లిమెంటరీ ఇద్దరుతో కలిపి 161 మంది పది పరీక్షలు రాస్తున్నారని, బి.కోడూరు కేంద్రంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వారికి అన్ని వసతులు కల్పిస్తున్నామని ఆయన అన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 13(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఈ నెల 17 నుంచి విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లికార్జున రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వద్ద బస్ పాస్ లేకపోయినా హాల్ టికెట్ చూసి పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ఎక్కించుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పబ్లిక్ హాలిడే రోజుల్లోనూ పరీక్షలు ఉంటే అనుమతించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన శుభా కాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేత

కాశినాయన మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడిగుడ్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల, వరికుంట్ల కస్తూర్బా పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 60 మంది విద్యార్థులకు వాకా చంద్రశేఖర్, జ్యోతీ మహేష్‌ల ఆర్థిక సహకారంతో గురువారం పరీక్ష కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు నాగరాజు, మెర్సీమాలిని, సీపీఎస్ కమిటీ కన్వీనర్ సుబ్రమణ్యం, ఎస్టీయూ మండల నేత ఎం.రవీంద్రబాబు సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఖాజీపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరారెడ్డి కొట్టాలుకు చెందిన రవీంద్ర అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బుధవారం రాత్రి పేరారెడ్డి కొట్టాలుకు చెందిన మోడల్ కాలేజీ హాస్టల్‌లో అక్రమంగా ప్రవేశిస్తుండగా విద్యార్థినులు గుర్తించి గట్టిగా అరవడంతో ఆ వ్యక్తి బూతులు తిడుతూ పారిపోయాడని, ప్రిన్సిపాల్ విజయనరసింహ ఫిర్యాదు చేయగా ఆ మేరకు విచారణ చేపట్టి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

భారీగా తరలి వెళ్లిన జనసేన నాయకులు

జమ్మలమడుగు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని జనసేన కార్యాలయం వద్ద నుంచి ఆవిర్భావ దినోత్సవ సభకు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నల్లంశెట్టి నాగార్జున ఆధ్వర్యంలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. పిఠాపురంలోని చిత్రాడలో 14న సాయంత్రం జరుగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి అధిష్టానం పిలుపుమేరకు జమ్మలమడుగు నుంచి రెండు బస్సుల్లో బయల్దేరుతున్నామన్నారు. జనసేన పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన లక్ష్మి ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా హనుమంత వాహనంపై శ్రీనివాసుడు గ్రామ పురవీధుల్లో ఊరేగాడు. ఈ కార్యక్రమాలకు పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

దివ్యాంగులకు రంజాన్ తోఫా పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ మదర్‌థెరీస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో 30 మంది దివ్యాంగులకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. గురువారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో త్రీటౌన్ ఎస్ఐ యోగేంద్ర ఆధ్వర్యంలో రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మదర్‌థెరీస్సా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, అల్తాఫ్, ఖాదర్, ఆసీఫ్, సుబ్బరాయుడు, జ్యోతి, వెంకటలక్ష్మి, గురుప్రసాద్ పాల్గొన్నారు.

అంకాలమ్మ తల్లి తిరునాళ్లు ప్రారంభం



అంకాలమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

బి.కోడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నెల్లి గ్రామ సమీపంలో సగిలేటి ఒడ్డున వెలసిన భక్తుల కొంగు బంగారం పిలిస్తే పలికే అంకాలమ్మ తల్లి తిరునాల అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పౌర్ణమి, హోళీ పండుగను పురస్కరించుకుని ప్రతి ఏటా ఆనవాయితీగా నిర్వహించే ఈ తిరునాల శుక్రవారం, శనివారం రెండు రోజులు ఘనంగా నిర్వహించనున్నారు. జిల్లా నలుమూల ల నుంచి వేలాదిగా భక్తులు తరలిరానున్నందున అందుకు తగినట్లు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పౌర్ణమి రోజున రాత్రికి అమ్మవారికి దున్నపోతును బలి ఇస్తారు. అదే రోజు చెక్క భజనలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. మరుసటిరోజు శనివారం పగలు తిరునాల సందర్భంగా బండ లాగుడు పోటీలు, అల్లెంగుండు పోటీలు నిర్వహిస్తారు. భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా సిరిమాను బండ్లు నిలుస్తాయి. ఆకర్షణగా బి.మఠం మండలం కేశాపురం గ్రామస్థులంతా దాదాపు 30లక్షల ఖర్చుతో నగదా బండిని అలంకరించి తల్లి గుడి చుట్టూ మూడు చుట్లు తిప్పుకుంటారు. పది గ్రామాల నుంచి కుంకుమబండ్లు వస్తుంటాయి. తిరునాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. బద్వేలు డిపో నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమాలన్నీ ఓబుల్‌రెడ్డి వారి వంశస్తులు ధర్మకర్తలుగా వ్యవహరిస్తూ నడిపిస్తుంటారు.

కాశినాయన జ్యోతిక్షేత్రాన్ని ప్రభుత్వమే కాపాడాలి



కూలదోసిన గోశాలను పరిశీలిస్తున్న ఎంపీ ,ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

కాశినాయన మార్చి13(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో ఆధ్యాత్మిక కేంద్రాలకు తలమానికమైన కాశిరెడ్డి నాయన జ్యోతిక్షేత్రాన్ని అటవీ అధికారులు కూల్చడం దురదృష్టకరమని ఈ ఆశ్రమాన్ని ప్రభుత్వమే కాపాడాలని కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు ఇటీవల అటవీ అధికారులు అనుమతులు లేవంటూ జ్యోతిక్షేత్రంలో కూల్చిన నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కేంద్ర అటవీశాఖ మంత్రికి 12.98 హెక్టార్ల అటవీ భూమిని కాశినాయన ఆశ్రమ యాజమాన్యానికి అప్పగించాలని స్పష్టంగా లేఖరాయడం, తర్వాత డిల్లీకి వెళ్లి అటవీ అధికారులను కలిసి విన్నవించడం జరిగిందన్నారు. ఈవిషయాలను రాజకీయం చేయడం తమ ఉద్దేశ్యం కాదన్నారు. కార్యక్రమంలో మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, బద్వేల్ మార్కెట్ మాజీ ఛైర్మన్ కరెంట్ రమణారెడ్డి, హనుమంతురెడ్డి, సర్పంచ్ పిచ్చిరెడ్డి, .రాజారెడ్డి, బి.వెంకటక్రిష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ సభను వాయిదా వేయాలి

మైలవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): దాల్మియా పరిశ్రమ ఈనెల 27వ తేదీన నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ సభను దుగ్గనపల్లె గ్రామ సమస్యలు పరిష్కరించిన తర్వాత నిర్వహించేలా వాయిదా వేయాలని ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని దుగ్గనపల్లె గ్రామంలో ఇటీవల మృతిచెందిన మోష కుటుంబాన్ని పరామర్శించి చిన్నారుల పరిస్థితులను అడిగి తెలుసుకుని రూ.2 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. అనంతరం దుమ్ము, దూళితో నిండిన మిరప పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ దాల్మియా పరిశ్రమలో జరిగే బ్లాస్టింగ్ వలన అలాగే పరిశ్రమ నుంచి వెలువడే దుమ్ము, దూళితో, దానితోపాటు వర్షాకాలం దుగ్గనపల్లె గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ దాల్మియా పరిశ్రమ వలన దుగ్గనపల్లె ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంగా పనిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంగా సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సచివాలయ శానిటరీ సెక్రటరీలు మెప్మా ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో పారిశుధ్య చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించడమే లక్ష్యంగా టీంలుగా వెళ్లి ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేయాలన్నారు. విద్యాసంస్థలు సంక్షేమ హాస్టళ్లు, మార్కెట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైల్వే, బస్ స్టేషన్లు ఫుడ్ ప్రాసెస్ సెంటర్లు పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రాల వద్ద ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో మెప్మా సీఎంఎం మహాలక్ష్మీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సుబ్బరాయుడు , సునీతలు పాల్గొన్నారు.

ఆటోలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకునేలా చూడండి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ఆర్టీవో కార్యాలయంలో ఆటోలకు ఫిట్‌నెట్ సర్టిఫికెట్ తీసుకునే అవకాశం కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్‌లు పేర్కొన్నారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఆర్టీవో కార్యాలయంలో ఆటోలకు ఎఫ్‌టీ చేయకుండా కడపకు వెళ్లాలని సూచిస్తున్నారన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో దాదాపు 8 వేల ఆటోలు ఉన్నాయని సంవత్సరానికి ఒకసారి ఫిట్‌నెట్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇలా ప్రతి సారి కడపకు వెళ్లాలంటే ఆటోలకు వ్యయప్రయాసలతో కూడుకున్న విషయమని అధికారులు స్పందించి ప్రొద్దుటూరులోని ఎఫ్‌టీ చేసేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆటోయూనియన్ కార్యదర్శి శేఖర్, ఓబయ్య, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకం



ప్రకృతి వ్యవసాయంతో పండిన పంటలను ప్రదర్శనగా ఉంచిన దృశ్యం

పోరుమామిళ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని పోరుమామిళ్ల వ్యవసాయ సహాయ సంచాలకుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. గురువారం పోరుమామిళ్ల వ్యవసాయ కార్యాలయ ఆవరణలో పోరుమామిళ్ల, కాశినాయన. బికోడూరు, బి.మఠం, కలసపాడు మండలాల్లో దాదాపు 4200 మంది రైతులకు ఆర్‌వైఎస్ఎస్ నుంచి ఆర్గానిక్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు ఎన్ఎఫ్ఏ శ్రీనాధరెడ్డి ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చి సిబ్బందికి, రైతులకు టీజీఎస్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పోరుమామిళ్ల డివిజను నుంచి 40 మందికిపైగా ప్రకృతి వ్యవసాయంచేయడం అభినందనీయమన్నారు. డివిజను పరిధిలోని ఎంటీఎస్‌లు, సీడీఐ, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, ఐఆర్‌సీపీలు పాల్గొన్నారు.

మహిళలు వారి హక్కులకోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న హరిత

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు వారి హక్కులకోసం ఉద్యమించాలని రాయలసీమ విద్యార్థి శక్తి కార్యదర్శి హరిత పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం సందర్భంగా వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ స్త్రీ, పురుషులు సమానం అన్న విషయం కుటుంబం నుంచే మొదలు కావాలన్నారు. రచయిత మహబూబ్ మాట్లాడుతూ స్త్రీలు హక్కులకోసం పోరాడి సాధించుకోవాలన్నారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకుడు నాగేంద్ర, కొత్తపల్లి యల్లయ్య, శ్రీను, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పెంపులో నిర్లక్ష్యం తగదు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాలు పెంచాలని పశువైద్య కళాశాల విద్యార్థులు చేస్తున్న నిరవధిక సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. గురువారం 39వ రోజు నిరసన సమ్మెలో భాగంగా పశువైద్య కళాశాల విద్యార్థులు, కొంతమంది వారి తల్లిదండ్రులు కళాశాల వద్దకు చేరుకుని విద్యార్థులు తమ న్యాయపరమైన డిమాండ్లకోసం చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపారు. ప్రభుత్వం త్వరగా స్పందించి విద్యార్థులకు న్యాయం జరిగేలా స్టైఫండ్‌ను పెంచుతూ జీవోను జారీ చేయాలని కోరారు.